క్లుప్తంగా

ఎండీఎం ఆయాలకు ఒక రోజు శిక్షణ

రాయవరం: మధ్యాహ్న భోజన పథకం ఆయాలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో త్వరలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో మిడ్ డే మీల్స్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో–2 వై.సూర్యనారాయణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎ.సరోజిని, ఎండీఎం కార్మికుల ట్రైనీ చిక్కాల పార్వతి, హెచ్ఎం సునీత తదితరులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, బుద్ధవరపు చారిటబుల్ ట్రస్ట్ పీఆర్వో అంగర వెంకట్, వైద్య సిబ్బంది హెచ్ఏలు టి.ఇమ్మానుయేలు, డి.మురళీకృష్ణ, సీఆర్ఎంటీలు వై.లక్ష్మీవీర్రాజు, కిలపర్తి పోసిరాములు, కుంచే నీనాసిరి, వాసంశెట్టి సీతాధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ

రాయవరం: మండలంలోని చెల్లూరులో 50 శాతం సబ్సిడీపై పశు దాణాను రైతులకు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ విజయ్ ఆధ్వర్యంలో మూడు టన్నుల పశు దాణాను రైతులకు పంపిణీ చేశారు. 50 కేజీల పశు దాణా బస్తా రూ.1,100 కాగా, 50 శాతం రాయితీపై రైతు వాటాగా రూ.555కు రైతులకు అందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు చుండ్రు వీర్రాజు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

48వ రోజుకు చేరుకున్న మహిళ రిలే దీక్ష

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం డి.కేశవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన మహిళ వల్లూరి శ్రీవాణి చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారంతో 40వ రోజుకు చేరుకుంది. గోడ నిర్మాణానికి ఓఎన్‌జీసీ నుంచి నిధులు మంజూరుకు అవకాశమున్న నేపథ్యంలో తన డిమాండ్‌ను త్వరితగతిన పరిష్కరించాలని శ్రీవాణి అధికారులను కోరారు.

8న షిరిడీసాయి విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: ఈనెల 8న మండలంలోని వెదురుమూడిలో నూతనంగా నిర్మించిన మందిరంలో షిరిడీ సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 7న మందిరం వద్ద గ్రామ ప్రదక్షిణ, గోపూజ, హోమం, నీరాజన మంత్ర పుష్పం పూజలు, గ్రామోత్సవం చేస్తారన్నారు. 8న ఉదయం బాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తారన్నారు. అదే రోజు అన్నదానం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం లైన్‌లో బుధవారం పలు చోట్ల నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సబ్‌స్టేషన్ ఏఈ సత్యనారాయణ ఆధ్వర్యంలోని సిబ్బంది స్తంభాల వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఎంపీ బోస్ పరామర్శలు

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ బుధవారం పలువురిని పరామర్శించారు. అన్నాయిపేటలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి నారాయణరావు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అదే విధంగా యండగండిలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కోట సత్యనారాయణ కుమారుడు సూర్యనారాయణమూర్తి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, అదే గ్రామంలో పార్టీ నాయకుడు కడలి రాజు తండ్రి మసేను మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎంపీ బోస్ పరామర్శించారు. ఎంపీ బోస్ వెంట శెట్టిబలిజ సంఘ నాయకులు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, పంపన సుబ్బారావు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పందు గోవిందరాజు, సర్పంచ్ కట్టా గోవిందు వడ్లమూరి బాబులు, అనిశెట్టి చంటి, కోటిపల్లి అబ్బు తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి నేడు సత్యసాయి దివ్యరథం రాక

కపిలేశ్వరపురం (మండపేట): శ్రీసత్య సాయి బాబా శతజయంతి మహోత్సవ నిర్వహణలో భాగంగా పుట్టపర్తిలోని బాబా దివ్యక్షేత్రం నుంచి ప్రారంభమైన ప్రేమవాహిని దివ్యరథం గురువారం మండపేట పట్టణానికి రానున్నట్టు నిర్వాహకులు, శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఎస్‌బీఐ బ్రాంచి నుంచి ప్రారంభమై మహనీయుల విగ్రహాల సెంటర్, కలువపువ్వు సెంటర్, కేపీ రోడ్డులోని రథం సెంటర్, వల్లూరి వారి వీధి మీదుగా సత్యసాయి మందిరానికి చేరుకొంటుంది. సాయంత్రం 5 నుంచి 9 గంటలు వరకూ బాబా దివ్య దర్శనానికి అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆందోళన

కపిలేశ్వరపురం (మండపేట): తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ మున్సిపల్ ఔటర్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం 13వ రోజుకు చేరుకుంది. కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరంలో కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి పలు ప్రజా సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

కూటమి వెన్నుపోటుపై ప్రజాగ్రహం

- మండపేటలో భారీ ర్యాలీ
- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు
- కూటమి పాలనపై విరుచుకుపడ్డ ఎమ్మెల్సీ తోట
- పేదలను విస్మరిస్తే ఉద్యమిస్తామని హెచ్చరిక


మండపేట కలువపువ్వు సెంటర్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


మండపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నాయకులు

కపిలేశ్వరపురం: మండపేట పట్టణం జనసంద్రమైంది. ఏడాది క్రితం ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలు సంగతి ఏంటంటూ సామాన్య ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎండను సైతం లెక్క చేయకుండా రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ఖరీఫ్, రబీ రెండు పంటలు పూర్తయినా తమకు కనీసం ఒక్క రూపాయి కూడా పెట్టుబడి సాయం అందజేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతా సుఖీభవ అంటూ అందమైన పేరు పెట్టి ఓట్లేయించుకుని తమకు వెన్నుపోటు పొడిచారంటూ కూటమి పాలకులపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఇంట్లో ఎంత మంది చిన్నారులు చదువుతుంటే అంతమందికీ ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున తల్లికి సాయమందిస్తామంటూ కూటమి నేతలు హామీ ఇచ్చిన సంగతేంటంటూ మహిళలు కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశారు. ఏడాది చదువులు పూర్తయ్యాయి. ఇంటిలో పిల్లలందరికీ కాదుకదా ఒక్క చిన్నారికి కూడా చిల్లిగవ్వ సాయం చేయలేదంటూ నిరసన తెలిపారు. తల్లికి వందనం పథకానికి ఒక ఏడాది మంగళం పాడారన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపునందుకుని వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో అడుగు వేశారు. 'అప్పుడు మామ ఎన్టీఆర్‌కు–ఇప్పుడు ఓట్లేసిన ప్రజలకు వెన్నుపోటు' అంటూ నినాదాలు చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. అక్కడ నుంచి మండపేట పట్టణం, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా సాగారు. ఎమ్మెల్సీ తోట, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, సీనియర్ నాయకుడు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు ర్యాలీలో అగ్రభాగాన నడిచారు. పట్టణ ప్రధాన రహదారి మీదుగా సాగుతూ రాజారత్నం సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బస్టాండ్, కలువపువ్వు, కేపీ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. దారి పొడవునా ర్యాలీకి ప్రజలు స్వాగతం పలికారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సమయంలో కూటమి పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నాయకులు చేతుల మీదుగా వినతి పత్రాన్ని అందజేశారు. కలువ పువ్వు సెంటర్‌లో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనా తీరును ఎండగట్టారు. ఎన్నికల సమయంలో గెలవడం కోసం అమలు సాధ్యం కాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాదిలోనే హామీలను అమలు చేయడం చేతకాక చేతులెత్తేశాడన్నారు. సూపర్‌సిక్స్ పేదల భవిష్యత్‌ను మార్చేస్తుందంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన ఉపన్యాసాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రాజకీయ పార్టీ ఏదైనా హామీలిస్తే సామాన్య ప్రజలు ఆశపడటం సహజమని, కానీ ప్రజలకిచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజలు క్షమించరన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో చదువుకునే పిల్లాడు కనిపిస్తే తల్లిని పిలిచి మీ ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున సాయమందిస్తామంటూ కల్లబొల్లి మాటలు చెప్పారన్నారు. విద్యార్థుల తల్లికి, రైతుకు ఇవ్వాల్సిన సాయం ఏడాదిగా విస్మరణకు గురైందన్నారు. మండపేట మున్సిపల్ కార్యాలయం సమీపంలో మద్యంషాపును తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేస్తే దాన్ని అమలు చేయకుండా మరో మద్యంషాపును కార్యాలయం సమీపంలో మరో మద్యం షాపును ఏర్పాటు చేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి హామీలన్నీ నీటి మూటలయ్యాయన్నారు. వైఎస్ జగన్ పాలనాకాలంలో అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారంటూ దుష్ప్రచారం చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఇబ్బడిముబ్బడిగా అప్పులను తెచ్చిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అమరావతిలో రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలను రోడ్డున పడేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల జెడ్పీటీసీ సభ్యులు కురుపూడి భవాని, పుట్టా అబ్బు, నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, పట్టణ కమిటీ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, మండల కమిటీ అధ్యక్షులు పిల్లా వీరబాబు, తమలంపూడి గంగాధరరెడ్డి, నాయకులు సత్తి వెంకటరెడ్డి, మేడిశెట్టి దుర్గారావు, గారపాటి అశోక్, నక్కా సింహాచలం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరు


రామచంద్రపురంలో జరిగిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాలకు తరలివెళ్లిన కాజులూరు మండల నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కూటమి పాలకుల నిరంకుశ పాలనను నిరసిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకూ బుధవారం రామచంద్రపురంలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' పేరుతో భారీ ఎత్తున నిరసన నిర్వహించారు.

మండల గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుగా గొల్లపాలెంలో సమావేశమై పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ర్యాలీగా రామచంద్రపురం తరలివెళ్లారు. పథకాల అమలుపై ప్రజావ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు 'రెడ్‌బుక్' పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి సోషల్‌మీడియా ద్వారా హడావుడి చేస్తుందన్నారు. కూటమి నయవంచన పాలనక ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం ధ్వజమెత్తిన కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంపదను సృష్టించి పేదవారిని ధనవంతులుగా మారుస్తానని చెప్పిన సంపద సృష్టిస్తానన్న మంత్రం ఏమైంది బాబూ' అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రామచంద్రపురం పట్టణంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని గాంధీపేటలోని పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులతో కలిసి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిలోని బీఆర్ అంబేద్కర్‌విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలతో పాటుగా 143 వాగ్దానాలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఆర్డీవో దేవరకొండ అఖిలకు వినతి పత్రం అందించి ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా మోసం చేసిందో ఆర్డీవో అఖిలకు వివరించారు. తక్షణం ప్రజలను ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం సూర్యప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను ముఖ్యమంత్రి అయిన ఏడాదిలోనే 90 శాతం వరకు అమలు చేసి దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచారన్నారు. గతంలో దేశంలో, ఏరాష్ట్రంలోనూ ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన మొట్టమొదటి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని గుర్తు చేశారు. అమలు సాధ్యం కాని హామీలను వాగ్దానం చేసి ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. అధికారమే పరమావధిగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కి నిట్టనిలువునా ప్రజలను మోసం చేసిందన్నారు. అందుకే జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా వైఎస్సార్ సీపీ చేపట్టిందన్నారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నిడి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, పార్టీ నాయకులు పెట్టా శ్రీనివాసరావు, వాసంశెట్టి శ్యాం, పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు తెలిపేందుకే వెన్నుపోటు దినం: ఎంపీ సుభాష్ చంద్రబోస్

ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, అందుకే వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, ప్రజలతో కలసి నిర్వహించినట్లు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ నేతృత్వంలో వెన్నుపోటు దినం నిరసనలో భాగంగా ప్రధాన రహదారిలో ర్యాలీ చేశారు. అనంతరం ఆర్డీవో డి.అఖిలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీ సుభాష్‌చంద్రబోస్ మీడియాతో మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కొంత సమయం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను ఏ ఒక్కటి అమలు చేయకపోవటం దారుణమన్నారు. అమలు సాధ్యం కాని హామీలను ఎన్నికల సమయంలో ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి తీరా ప్రభుత్వం ఏర్పాటయ్యాక సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతూ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచింది కూటమి ప్రభుత్వమేనన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు.


రామచంద్రపురం ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు


రామచంద్రపురంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో పాల్గొన్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్ పార్టీ నేతలు

డిపో మేనేజర్ భాస్కరరావుకు అవార్డు


జిల్లా డీపీటీఓ రాఘవకుమార్ చేతుల మీదుగా బుధవారం అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ భాస్కరరావు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు ఆయిల్ పొదుపు, అధిక ఆదాయం సాధించిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీయ జిల్లా డీపీటీఓ రాఘవకుమార్ చేతుల మీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు. అదే విధంగా రామచంద్రపురం ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులు, కండక్టర్లు, డైవర్లు ఆదర్శ ఉద్యోగ అవార్డులను అందుకున్నారు. డీపీటీఓ రాఘవకుమార్ మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయనడానికి రామచంద్రపురం ఆర్టీసీ డిపో ఉదాహరణగా నిలిచిందన్నారు. డిపో మేనేజర్ భాస్కరరావు మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేసే సిబ్బంది సహకారంతో అవార్డులు సాధ్యమయ్యాయన్నారు. ముందు ముందు కూడా అందరి సహకారంతో టార్గెట్లు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ సూపరింటెండెంట్ జి.రవిబాబు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ జి.రవికుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ పీసీహెచ్ శేఖర్, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటడం జీవన విధానంగా మారాలి


అద్దంకివారిలంకలో సర్పంచ్, నాగేశ్వరిలతో చిన్నారులు

కపిలేశ్వరపురం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరికీ మొక్కలు నాడటం, వాటిని సంరక్షించడం జీవన విధానంగా అలవాటు కావాలని బుధవారం నిర్వహించిన పర్యావరణ పరిరక్షణలో పాల్గొన్న వక్తలన్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్రై శ్రమ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో చిన్నారులతో ఉద్యాన పంటల ప్రత్యక్ష సందర్శన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాతి గవరయ్య మాట్లాడుతూ పచ్చని పల్లెలను ఆధునికత పేరుతో నాశనం చేయడం సరికాదన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ సంస్థలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవుల్లోని దాదాపు 100 గ్రామాల్లో 2 వేల మంది చిన్నారులతో జూన్ 4, 5 తేదీల్లో చెట్లున్న ప్రదేశాలను సందర్శించే కార్యక్రమాలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో క్రై సంస్థ సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్, శ్రమ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ నాగేశ్వరి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. ఆసక్తి కనబర్చిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

పాఠశాలల వారీగా పుస్తకాల విభజన

కపిలేశ్వరపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను పాఠశాలలు, తరగతుల వారీగా విభజిస్తున్నట్టు ఎంఈఓ కె.తాతారావు బుధవారం తెలిపారు. మండలంలో 8 ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత, 37 ప్రాథమికోన్నత మొత్తం 51 పాఠశాలలకు చెందిన 2,689 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారి కోసం 10,486 పుస్తకాలను, బెల్ట్‌లను సరఫరా చేశారన్నారు. వాటిని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో భద్రపర్చామని, సీఆర్‌పీల పర్యవేక్షణలో తరగతులు వారీగా విభజిస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే మండలంలోని పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.

చెట్లను కాపాడాలి


పర్యావరణ దినోత్సవం సందర్భంగా త్రినాథ్ గీసిన చిత్రం

రామచంద్రపురం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథ ప్రసాద్ వేసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. పర్యావరణాన్ని కాపాడాలంటే చెట్లను కాపాడాలని తన చిత్రంలో త్రినాథ ప్రసాద్ సందేశాన్ని ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం యు.మాచిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధులకు ఇంటికే రేషన్ అందించాలి


కాజులూరులో రేషన్ పంపిణీ చేస్తున్న జేసీ రాహుల్ మీనా

కాజులూరు: గ్రామాలలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు రేషన్‌షాపు నిర్వాహకులే వారి ఇళ్లకు వెళ్లి రేషన్ సరకులు అందజేయాలని కాకినాడ జిల్లా జేసీ రాహుల్ మీనా అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో జేసీ రాహుల్‌మీనా పర్యటించి పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ప్రస్తుతం ఉపాధి పనులు, వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా లబ్ధిదారులు పూర్తిస్థాయిలో రాలేకపోతున్నారని వారు కూడా రేషన్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఆర్ఐ వేగేశ్వరరావు, ఎంఎస్ఓ అనిల్, వీఆర్వోలు సత్యనారాయణ, ఈశ్వరరావు ఆదినారాయణ, రేషన్ డీలర్లు వెలుగుబంటి కొండ, తాతారావు, నున్న ప్రవీణ్, పలువురు రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పీఆర్ డీఈఈకు పలువురి పరామర్శ


వెలంపాలెంలో రాంబాబు తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్, సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అన్యం రాంబాబు అన్యం రాంబాబు మాతృమూర్తి అన్యం సత్యవతి ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంట్ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, రామచంద్రపురం కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావులు వెలంపాలెంలోని ఆయన ఇంటి వద్ద పరామర్శించారు. సత్యవతి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు వేల మందికి మజ్జిగ వితరణ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో బుధవారం రూరల్ మండలం మెర్నిపాడు సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకుడు అశోక్ దంపతులు 5 వేల మందికి మజ్జిగ వితరణ చేశారు. వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ సాగుతున్న రహదారి వెంబడి పలు చోట్ల, సాధారణ ప్రయాణికులు ఉండే కూడలిలోనూ మజ్జిగ అందజేశారు. వేసవి తాపం అధికంగా ఉన్న నేపథ్యంలో అశోక్, సౌజన్య దంపతుల సేవా కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.


మజ్జిగను అందజేస్తున్న గారపాటి అశోక్